ఈనాడు
అన్నమయ్య
ఆదివారం సెప్టెంబరు 29, 2024

దసరాకు 758 ప్రత్యేక బస్సులు

చిన్నచౌకు (కడప), న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా కడప ఆర్టీసీ జోన్ (కడప, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నంద్యాల) పరిధిలో 758 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు శనివారం వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా నుంచే 230 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బస్సులు అక్టోబరు 4 నుంచి 11వ తేదీ వరకు నడవనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచుతామని, సాధారణ టికెట్ ఛార్జీలే వసూలు చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి 285, బెంగళూరు నుంచి 224, విజయవాడ నుంచి 76, చెన్నై నుంచి 40, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు 133 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పండగ అనంతరం అక్టోబరు 13వ తేదీ నుంచి తిరుగు ప్రయాణానికి 596 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడకు 73, హైదరాబాద్‌కు 215, బెంగళూరుకు 253, చెన్నైకి 23, ఇతర ప్రాంతాలకు 32 చొప్పున బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నూరు శాతం పరిశీలన


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన జిల్లా అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల పరిశీలన ఈ నెల 30వ తేదీలోగా నూరు శాతం పూర్తిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు చట్టబద్ధంగా సర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పీజీఆర్ఎస్‌లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అసైన్‌మెంట్ భూముల పరిశీలన పూర్తి చేసి అక్టోబరు 20వ తేదీలోగా నివేదికలు సమర్పించాలన్నారు. ఎవరైనా పరిశీలన కార్యక్రమాన్ని తప్పుదోవ పట్టించాలని చూస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలాల వారీగా ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన, తిరుష్కరణలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆ పనులు ఆపేయండి

☛ 25 శాతం లోపుంటే రద్దు
☛ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి, సాగునీటి పనులు 25 శాతం లోపే ప్రగతి ఉంటే వెంటనే ఆపేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుత్తేదారులతో నిర్దేశిత ఒప్పందం జరిగిన అనంతరం భౌతికంగా పాతిక శాతం లోపే చేసిన వాటిని తక్షణమే గుర్తించి నివేదించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇటు వైఎస్ఆర్, అటు అన్నమయ్య జిల్లాల పరిధిలో నీటి పారుదల, పంచాయతీరాజ్, రహదారులు, భవనాలు, ప్రజారోగ్య, గ్రామీణ తాగునీటి సరఫరా, ఇతర శాఖల్లో ఇంకా మొదలు పెట్టకపోయినా వాటి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికే శ్రీకారం చుట్టి 25 శాతం లోపే పురోగతి ఉన్న పనుల వివరాలను క్షేత్రస్థాయి నుంచి తెప్పిస్తున్నారు. నీటిపారుదలశాఖలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనుమతి ఇచ్చినప్పటికీ కొంతమంది గుత్తేదారులు ముందుకురాలేదు. టెండర్లలో పాల్గొని పనులు దక్కించుకున్న అనంతరం నిదానంగా చేపట్టి మధ్యలోనే నిలిపేశారు. ఇలాంటి వాటిని రద్దు చేయాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. కుందూ నుంచి తెలుగుగంగ పథకంలో నీటిని తరలించే ఎత్తిపోతల పథకం నిలిచిపోనుంది. గాలివీడు ఎత్తిపోతల పథకం పనులు సైతం వేగంగా ముందుకు కదలడం లేదు. సర్వరాయసాగర్, వామికొండ జలాశయాల పరిధిలో పనుల తీరు చూస్తే నత్తే నయమనిపిస్తోంది. అన్నమయ్య జలాశయం మట్టికట్ట పునరుద్ధరణ పడకేసింది. పులివెందుల నియోజకవర్గం పరిధిలో పీబీసీ, సీబీఆర్, జీకేఎల్ఐ పరిధిలోనూ సూక్ష్మనీటి సాగు పథకం పనుల తీరు చూస్తే మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. పైగా పరిపాలన అనుమతిచ్చినా తర్వాత టెండర్లు పిలిచినా పనులు చేయడానికి గుత్తేదారులు ఆసక్తిచూపలేదు. ఇలాంటి పనులను కూడా పక్కన పెట్టనున్నారు. పథకం, ప్యాకేజీ వారీగా అధికారుల పనుల సమాచారం సేకరిస్తున్నారు. తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని అనుసరించి చేపట్టాలనా, వద్దా అనేది నిర్ణయం తీసుకుంటామని నీటిపారుదలశాఖ సీఈ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

పట్టాలెక్కనున్న జాతీయ రహదారులు!



- ఎన్డీయే ప్రభుత్వ హయాంలో కలగనున్న మోక్షం
- కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిన రాష్ట్ర సర్కారు
- కేంద్ర మంత్రి గడ్కరీ నుంచి సానుకూల స్పందన

– ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన జాతీయ రహదారుల నిర్మాణ పనులకు మోక్షం కలగనుంది. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల అభివృద్ధికి ఊతమిచ్చేవిధంగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అడుగులేస్తున్నాయి. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి.. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందజేశారు. అత్యధిక ట్రాఫిక్ ఉన్న రాష్ట్ర మార్గాలను జాతీయ రహదారులుగా మార్చాలని కోరారు. దీనికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు తయారు చేసినప్పటికీ ప్రత్యేక దృష్టిసారించకపోవడంతో పెండింగ్‌లో పడిపోయాయి.

రేణిగుంట నుంచి కడప వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు గతంలోనే కేంద్రం ఆమోదముద్ర వేసింది. సోలాపూర్- చెన్నై ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా కడప- రేణిగుంట మధ్య ఉన్న జాతీయ రహదారి 716ను రూ.1,500 కోట్లతో పూర్తి చేసేందుకు టెండర్లు పూర్తయ్యాయి. అటవీశాఖ అనుమతులు రాగానే త్వరలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. నాలుగు వరుసల రహదారికి అనుసంధానంగా సిద్దవటం మండలం భాకరాపేట నుంచి బద్వేలు, పోరుమామిళ్ల మీదుగా ప్రకాశం జిల్లా బేస్తవారిపేట వరకు జాతీయ రహదారి నిర్మాణానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తంగా 161 కిలోమీటర్ల పొడవు గల జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం రహదారి రాకపోకలకు అనువుగా లేదు.

లాజిస్టిక్ హబ్‌లకు అవకాశం

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి రాయచోటి మీదుగా రాజంపేట, చిట్వేలి, రాపూరు, గూడూరు మీదుగా కృష్ణపట్నం రేవును అనుసంధానిస్తూ 296 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం జరగనుంది. ఈ రహదారితోపాటు కడప- రేణిగుంట మార్గం కలయికతో అటు బెంగళూరు, ఇటు చెన్నై, మరోవైపు కృష్ణపట్నం పోర్టు అనుసంధానం జరుగుతుంది. ప్రధాన నగరాలకు సరకు రవాణా కేంద్రాల అవసరం పెరుగుతుంది. ఈ మార్గం సైతం వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల అభివృద్ధికి దోహదపడనుంది. జాతీయ రహదారుల వెంట భూముల ధరల పెరుగుదలతోపాటు ఆయా నియోజకవర్గాల్లో పంట ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరిగేందుకు అవకాశాలు మెండుగా ఉండనున్నాయి. కొప్పర్తి పారిశ్రామికవాడకు అనుసంధానంతోపాటు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీల స్థాపనకు అవకాశాలు పెరగనున్నాయి. ఇలా కదిరి- కృష్ణపట్నం రేవు, రేణిగుంట- కడప, భాకరాపేట- బేస్తవారిపేట.. మూడు జాతీయ రహదారులు అనుసంధానంతో అభివృద్ధి ఊపందుకోనుంది. మరోవైపు బెంగళూరు- విజయవాడ జాతీయ రహదారి వైఎస్ఆర్ జిల్లా మీదుగా వెళ్లనుంది. ఈ మేరకు పనులు సైతం జరుగుతున్నాయి. ◆ అన్నమయ్య జిల్లాలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)ల నిర్మాణానికి రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్డిపల్లె- పుల్లంపేట స్టేషన్, కోడూరు- అనంతరాజుపేట, అనంతరాజుపేట యార్డు సమీపంలో మరొకటి నిర్మాణం జరగనుంది. రైల్వేలెవల్ క్రాసింగ్‌ల వద్ద వంతెనల నిర్మాణానికి ఆమోదముద్ర వేయడంతో ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయి.

ఎస్పీడీసీఎల్‌లో విభజన కసరత్తు

వచ్చే నెల నుంచి నూతన విధానం అమలుకు నిర్ణయం

– న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం


కడప ఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం

దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ పర్యవేక్షణలోని ఉమ్మడి కడప జిల్లా విభజన ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. కడప సర్కిల్ కింద ఉన్న రాయచోటి, రాజంపేట డివిజన్లను అన్నమయ్య జిల్లా పరిధిలోకి చేర్చాలని ఉన్నత స్థాయి నుంచి అనుమతిచ్చారు. రాయచోటిలో సర్కిల్ (ఎస్ఈ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. రాజంపేట డివిజన్ కింద ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప డివిజన్ పరిధిలోకి చేర్చనున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో గతంలో ఆరు డివిజన్లు ఉండేవి. రాజంపేట, రాయచోటి అన్నమయ్య జిల్లాలోకి వెళ్లడంతో వైఎస్ఆర్ జిల్లాలలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్లు మాత్రమే ఉండనున్నాయి.

◆ అన్నమయ్య జిల్లా పీలేరు డివిజన్‌లో గతంలో 8 మండలాలుండేవి. ఇకపై ఎర్రవారిపాళెం, చిన్నవట్టికుల్ మండలాలను తిరుపతి సర్కిల్‌లోకి చేర్చనున్నారు. పీలేరు డివిజన్ నుంచి అన్నమయ్య జిల్లాలోకి ఆరు మండలాలే వస్తాయి. ◆ రాయచోటిలో ఏర్పాటు చేయనున్న కొత్త సర్కిల్‌లోకి రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు డివిజన్లు రానున్నాయి. ◆ వైఎస్ఆర్ జిల్లాలో ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు కలిపి 58 మంది, రాయచోటిలో ఏర్పాటు కానున్న నూతన కార్యాలయం పరిధిలో 55 మంది పనిచేసేవిధంగా అనుమతిచ్చారు. ◆ వైఎస్ఆర్ జిల్లాలో గృహ, వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థలు, వ్యవసాయ, హెచ్‌టీ కనెక్షన్లు 9.41 లక్షలుండగా, అన్నమయ్య జిల్లాలో 8.75 లక్షలు సర్వీసులుంటాయని అంచనా వేశారు.. ◆ ఉమ్మడి జిల్లా సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బందిని సర్దు బాటు చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న యంత్రాంగం నుంచి బదలాయింపు, సర్దుబాట్లకు అభ్యర్థనలు స్వీకరించాలని చర్చిస్తున్నారు. మార్గదర్శకాల జారీపై కసరత్తు జరుగుతోంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే...: - రమణ, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్, కడప సర్కిల్

ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త సర్కిల్ ఏర్పాటు, డివిజన్ల పునర్విభజన చేయాలని నిర్ణయించాం. ఉమ్మడి కడప సర్కిల్ పరిధిలోని రాజంపేట, రాయచోటి డివిజన్లు ఇక అన్నమయ్య కొత్త ఎస్ఈ కార్యాలయం పరిధిలోకి వెళ్లనున్నాయి. ఈ మేరకు ఇటీవల ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఇప్పటికే విభజన ప్రక్రియపై కసరత్తు మొదలైంది. వచ్చే నెల నుంచి నూతన పాలన అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి


వసతి గృహంలోని వంట గదిని పరిశీలిస్తున్న జిల్లా 5వ అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి

సంబేపల్లె (రాయచోటి), న్యూస్‌టుడే: వసతిగృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా 5వ అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. సంబేపల్లె ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. వసతిగృహం పరిసరాలు, వంట గదులను తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. తాజా కూరగాయలతో విద్యార్థులకు భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట వసతి గృహం సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

పోలీసుశాఖ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


యంత్రాలతో తొలగిస్తున్న అక్రమ నిర్మాణాలు

కలకడ, న్యూస్‌టుడే : కలకడ మండల కేంద్రంలోని పోలీసుశాఖ స్థలంలో ఆక్రమణలను శనివారం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. పోలీసు స్టేషన్‌కు బ్రిటిష్ పాలనలోనే మూడెకరాల స్థలం కేటాయించి, అక్కడ పోలీసు స్టేషన్, ఎస్.ఐ, సిబ్బందికి నివాసగృహాలను నిర్మించారు. కొంత స్థలంలో స్థానికులు నివాసాలను ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నారు. గతంలో వారికి అధికారులు కాలనీలలో ఇళ్ల స్థలాలతోపాటు గృహాలను మంజూరు చేశారు. కొంతమంది వెళ్లగా, మరికొంత మంది అక్కడే ఉన్నారు. స్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసు అధికారులు వారికి పలుమార్లు సూచించినా ఖాళీ చేయకపోవడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఆదేశాల మేరకు శనివారం పోలీసు అధికారుల సమక్షంలో వారిని ఖాళీ చేయించి, ఆక్రమణలను యంత్రాలతో తొలగించి కంచెను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోలీసు స్థలాన్ని పరిరక్షించాలని, భవిష్యత్తులో భవన నిర్మాణాలకు ఉపయోగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐలు గురునాథ, గురుప్రసాద్, ఎస్.ఐ.లు రామాంజనేయులు, రవి, ఎస్టీఎస్ పోలీసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెలవారీ ఉద్యోగోన్నతుల కల్పనకు డిమాండు


మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర బాధ్యుడు శ్రీనివాసరాజు

సంబేపల్లె (రాయచోటి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల నెలవారీ ఉద్యోగోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర బాధ్యుడు శ్రీనివాసరాజు డిమాండు చేశారు. సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లుగా, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఇచ్చే నెల వారీ ఉద్యోగోన్నతులపై దృష్టిసారించాలన్నారు. కొత్త పీఆర్సీ ఏర్పాటుకు కమిటీ నియమించాలని, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండు చేశారు. గత ప్రభుత్వం నిలిపేసిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఉద్యోగవిరమణ ప్రయోజనాలు, సంపాదిత సెలవుల నగదు చెల్లింపు తదితర పాత బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్, డైట్ కళాశాలల్లో అధ్యాపకులకు శాశ్వత నియామక పద్ధతిలో ఉద్యోగోన్నతులిచ్చి భర్తీ చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు అడ్డంకిగా ఉన్న జీవో 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, ఎన్‌టీఏ నాయకులు రామాంజులు, రెడ్డెన్న, రెడ్డెయ్యరాజు, మధుసూదన్‌రెడ్డి, పీరయ్య, రామయ్య, రామానాయుడు, రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో ఇళ్ల నిర్మాణాలు


మిట్టమీదపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంత నిరుపేదలకు నివాస పట్టాలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన గత వైకాపా ప్రభుత్వం నిధుల విడుదల, మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైంది. దీంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రాజంపేట మండలం ఊటుకూరు, పోలి, మిట్టమీదపల్లి, బ్రహ్మణపల్లి గ్రామాల్లోని 2,666 లేఅవుట్లను శనివారం రహదారులు, భవనాలశాఖ ఎస్ఈ సహదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, గృహనిర్మాణశాఖ ఈఈ మురళి, పురపాలక సంఘం కమిషనర్ నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇల్లు మన గౌరవం' అనే కార్యక్రమం ద్వారా ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు వారు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి



మాట్లాడుతున్న వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాసి హరికృష్ణ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాసి హరికృష్ణ డిమాండు చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వాల్మీకులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. దేశంలో చాలా ప్రాంతాల్లో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించారని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎస్టీలుగా గుర్తించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అయినా తమను ఎస్టీలుగా గుర్తిస్తే గుండెల్లో పెట్టుకుని చూస్తామని అన్నారు. అలాగే అక్టోబరు 17న జరిగే వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించడంతోపాటు సెలవు దినంగా ప్రకటించాలన్నారు. వాల్మీకులు రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలన్నారు. బోయకొండ గంగమ్మ ఆలయ ఛైర్మన్ పదవి వాల్మీకి, బోయలకు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం బోయలను అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం బోయలకు ఛైర్మన్ పదవి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు, గౌరవాధ్యక్షుడు బొగ్గిటి కృష్ణమూర్తి, నాయకులు వేణుగోపాల్, చంద్రాయప్ప, ఎం.రవి, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులపై చిన్నచూపు!

పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు	పూర్తయిన కంటి పరీక్షలు	అద్దాల అవసరం	పరీక్షలు పూర్తయిన పాఠశాలలు
2,148	65,342	24,274	1,445	174

న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

దృష్టి దోషాల నివారణలో చిత్తశుద్ధి కరవు


రైల్వేకోడూరులో పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్య నిపుణులు

నేటి విద్యార్థులే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తును శాసించే రేపటి పౌరుల్లో కంటి చూపు మందగిస్తోంది. అన్ని అవయవాల కన్నా కళ్లు ప్రధానమైనవి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 24,274 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 1,445 మందికి అద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. బాలలు ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా చరవాణికి అతుక్కుపోవడంతో అనేక కంటి జబ్బులకు గురవుతున్నారు. సరైన పోషకాహారం తీసుకోవడం లేదు. ఫలితంగా కళ్లపై తీవ్ర ప్రభావం పడుతోంది.

◆ స్కూల్ ఆఫ్ హెల్త్ ఐ స్క్రీనింగ్' పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు ఒకటి నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆప్తమాలజిస్టులు బృందాలుగా ఏర్పడి ప్రాథమిక పరీక్షలు చేస్తున్నారు. అక్టోబరు వరకు కార్యక్రమం కొనసాగనుంది.

◆ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 15 మంది నిపుణులకుగానూ కేవలం అయిదుగురు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం రోజుకు 600 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరులలో వరుస సెలవులు రావడం, విద్యార్థులకు పరీక్షలు జరగడంతో ప్రాథమిక పరీక్షలు చేయడం సమస్యగా మారింది.

◆ వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 2023-2024 విద్యాసంవత్సరంలో 423 పాఠశాలల్లోని 80,027 మంది విద్యార్థుల్లో 72,715 మంది విద్యార్థులను పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. 4,280 మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. 52 పాఠశాలల విద్యార్థులకు గతేడాది పరీక్షలు చేయలేదు.

◆ గతేడాది పరీక్షలు చేసినా విద్యార్థులకు కంటి అద్దాలు రాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో నేత్ర పరీక్షలు సక్రమంగా నిర్వహించడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నిపుణుల కొరతను నివేదించాం

అన్నమయ్య జిల్లాలో 15 మందికి అయిదుగురు మాత్రమే ఆప్తమాలజిస్టులున్నారు. కంటి వెలుగు పథకం కింద కేటాయించిన సిబ్బందిని ఇవ్వాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఇస్తామని కలెక్టర్ చెప్పారు. త్వరలోనే లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. - **డాక్టర్ డి.ఎం.రియాజ్‌బేగ్, సమన్వయకర్త, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అన్నమయ్య**

యథేచ్ఛగా కాలువల కబ్జా!

వరదలొస్తే ముప్పు తప్పదని ప్రజల ఆందోళన

– న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ, నందలూరు


పాపరాజుపల్లి వద్ద ఆక్రమిత కాలువలో పంటల సాగు

ప్రజావసరాలకు ప్రభుత్వం కేటాయించిన భూములు, సాగునీటి కాలువలను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

రాజంపేట మండలం పాపరాజుపల్లి నుంచి శేషమాంబాపురానికి సాగునీరందించే కాలువను పాపరాజులుపల్లికి చెందిన కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో శేషమాంబపురంలో 130 ఎకరాలను సాగునీరందడంలేదు. కొందరు ఆలయం పేరిట, మరికొందరు పంటల సాగుకు కాలువను పూడ్చేశారు. కాలువను పూడ్చేయడంతో చెయ్యేరు నుంచి సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామసమీపంలోని కలికిరి చెరువులో నీరున్నా ఉపయోగపడడంలేదు.

◆ చెయ్యేరు నుంచి నందలూరులోని కన్యకా చెరువులోకి వరద నీరు రావడానికి కయ్యం కాలువ ఉంది. కొంతమంది వ్యాపారులు కాలువను పూడ్చేసి భవన నిర్మాణాలు సాగిస్తున్నారు. దీంతో భారీ వర్షాలకు నందలూరులోని పలు ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. 2021లో వచ్చిన వరదలకు పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అప్పటి రాజంపేట సబ్‌కలెక్టర్ కేతన్‌గార్గ్ అక్రమ కట్టడాలు వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కొన్నాళ్లకు ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో అధికారులు, పట్టించుకోలేదు. దీంతో కాలువపై తిరిగి అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. కాలువపై నిర్మాణాలు చేపడు తుండడంతో పూడిక తీసేందుకు వీలు కాని పరిస్థితి నెలకొంది.

◆ ఈ విషయమై నీటిపారుదలశాఖ ఏఈ రాజన్న మాట్లాడుతూ రూ.8 లక్షలతో కాలువల్లో పూడికతీత పనులకు నివేదికలు సిద్ధం చేశామన్నారు. కాలువలపై అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు. రాజంపేట మండలం పాపరాజుపల్లి కాలువపై అక్రమ నిర్మాణాలు పరిశీలించి వెంటనే తొలగిస్తామన్నారు.


అనుమతులు లేకుండా కాలువపై చేపడుతున్న నిర్మాణాలు

పక్కా ఓటర్ల జాబితాకు సహకరించండి

మదనపల్లె (గ్రామీణ, న్యూస్‌టుడే: తప్పులేని పక్కా ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ చెప్పారు. శనివారం రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితా సవరణ చేపట్టిన సర్వేకు సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో 2,66,810 మంది ఓటర్లున్నారని, ఇంటింటి సర్వేలో 2,66,248 మంది ఓటర్లకు సంబంధించి పరిశీలించామన్నారు. వీటిలో 1,444 మంది మృతి చెందినట్లు గుర్తించామని, 447 డూప్లికేట్, డబుల్ ఎంట్రీలున్నాయని, 1,015 మంది ఓటర్ల ఫొటోలు సక్రమంగా లేవని, 524 షిఫ్ట్ అయినట్లు గుర్తించామన్నారు. 18 నుంచి 19 సంవత్సరాల కలిగిన నూతన ఓటర్లకు సంబంధించి 7,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిపై క్షేత్రస్థాయిలో విచారించి ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని చెప్పారు. 5వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఎక్కువ మంది ఓటు హక్కు కల్పించడంతో పునర్విభజన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 37, 72 నంబరు పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు పెడుతున్నామన్నారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ... మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో రెండు ప్రాంతాల్లో ఓటర్లున్నారని, వీరిని గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పడంతో పార్టీలు బీఎల్‌ఏలను ఏర్పాటు చేసి సర్వే సమయంలో ఇలాంటి వాటిని గుర్తించి నివేదిక ఇస్తే విచారించి జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు ఖాజాబీ, నిర్మలాదేవి, ధనంజయులు, ఎన్నికల డీటీలు, పార్టీ నాయకులు బాలసాని, రెడ్డిసాహెబ్, శ్రీనివాసులు, శివరాం, మురళి, భగవాన్, కిరణ్‌కుమార్, రహీం, మహేశ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

హార్సిలీహిల్స్‌పై సీసీ కెమెరాల ఏర్పాటు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో 14 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నట్లు బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ... నేరాల నియంత్రణలో భాగంగా సహకారంతో నిఘాను పటిష్ఠం చేస్తున్నామని, వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. బి.కొత్తకోటలోని జ్యోతి బస్టాండులో నాలుగు సీసీ కెమెరాలను అమర్చినట్లు వివరించారు.

ఆలస్యంగా నడిచిన ప్యాసింజరు రైలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తిరుపతి గుంతకల్లు మధ్య నడిచే ప్యాసింజర్ రైలు శుక్రవారం అర్ధరాత్రి ఆలస్యంగా నడిచింది. తిరుపతి నుంచి పీలేరు, వాల్మీకిపురం, మదనపల్లె, ములకలచెరువు మీదుగా గుంతకల్లు వెళ్లే ఆ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 4.01కు వచ్చింది. సుమారు రెండు గంటలకు పైగా ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో మదనపల్లె డిపో-1 ప్రథమం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల పరిధిలో వివిధ విభాగాల్లో మదనపల్లె 1వ డిపో ప్రథమ స్థానానికి చేరిందని డిపో మేనేజరు ఎంవీ రమణారెడ్డి తెలిపారు. డిపో కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ డీజిల్ పొదుపు, ఆదాయ సాధన, ప్రయాణికుల శాతం, బ్యాటరీ వాడకంతో సహా వాహనాలు నడపటంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 1వ డిపో నడిచిందన్నారు. ఆయా విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 1వ డిపో ఈ స్థానానికి చేరడం పట్ల డీఎం సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కృషి ఉద్యోగులు, పర్యవేక్షకులు, గ్యారేజీ సిబ్బందిదేనని వారిని ప్రశంసించారు.

అరకిలో గంజాయి, ద్విచక్ర వాహనం జప్తు

నిందితుడిపై ఇది వరకే మూడు కేసులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లె డివిజన్‌లో కళాశాల విద్యార్థులకు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో విక్రయాలకు గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. తంబళ్లపల్లె మండలం రేణిమాకులపల్లె పంచాయతీ జోగివానిపల్లె గ్రామం వద్ద కోళ్లఫారం వద్దకు కవర్‌తో వెళ్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా ముదివేడు ఎస్.ఐ. దిలీప్‌కుమార్ అతని సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుడు కలకడ మండలం బంగారువాండ్లపల్లెకు చెందిన వరూన్ మౌలాలి (28)గా నిర్ధారించుకున్నారు. ఇతనిపై మదనపల్లె రూరల్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. ఇతని వద్ద గంజాయి కొనుగోలు చేసి విక్రయాలు చేసే 29 మందిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడైన మౌలాలి విశాఖపట్నం, ఒడిశా సరిహద్దు నుంచి గంజాయి రైలు ద్వారా మదనపల్లె డివిజన్‌కు తీసుకొచ్చి ఇక్కడ పొట్లాల రూపంలో విక్రయాలు చేస్తున్నట్లు తేలిందన్నారు. ఇతను ఆరు నెలలుగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అతని చరవాణి నంబరు ఆధారంగా అతను ఎన్నిరోజులుగా ఒడిశాకు చెందిన వ్యాపారులతో మాట్లాడుతున్నాడో విచారణ చేస్తామన్నారు. ఇంకా ఇతని వద్ద ఎవరెవరు గంజాయి కొనుగోలు చేస్తున్నారో విచారణ చేస్తామన్నారు. ప్రధాన నిందితుడైన మౌలాలిని అరెస్టు చేసిన ముదివేడు ఎస్.ఐ. దిలీప్‌కుమార్, సిబ్బంది రమేష్‌నాయక్, సుధాకర్, జ్యోతి, జమీల్ అహ్మద్‌లను డీఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో గంజాయి నిందితులను పట్టుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు.



నిందితుడిని చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు, ముదివేడు ఎస్.ఐ. దిలీప్‌కుమార్, పోలీసులు

జూనియర్ అసిస్టెంటు అదృశ్యంపై ఫిర్యాదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు. ఎర్రముక్కపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అన్నమయ్య జిల్లా రాజంపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 23న విధులకు వెళ్లి తిరిగి రాలేదు. అధికారుల వేధింపులు తాళలేక వెళ్లిపోతున్నట్లు లేఖలో రాసినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి భార్య బేబీ షామిలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజులు అనంతరం ఆయన భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాల్‌డేటా ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

ఆర్టీవో బాధ్యతల స్వీకరణ



ప్రసాద్

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా ప్రాంతీయ రవాణా అధికారిగా కె.ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తెనాలి నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ ఆర్టీవోగా పని చేసిన ఎల్.భరత్‌చవాన్‌ను కర్నూలు రవాణా శాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లాలో రహదారుల ప్రమాదాల నివారణతో పాటు అక్రమ వాహనాల రాకపోకలను కట్టడి చేసేందుకు కృషి చేస్తామని ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రతిభావంతురాలికి దాతల సాయం

స్పందనకు వందనం

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: పేదరికంతో ఇంజినీరింగ్ విద్యకు దూరమవుతున్న విద్యార్థిని రేష్మాను తాము చదివిస్తామని దాతలు ముందుకు వచ్చారు. ఈనాడులో ప్రతిభావంతురాలి చదువుకు 'పేదరికమే అడ్డంకి' శీర్షికన ఈ నెల 26వ తేదీన ప్రచురితం అయింది. ఈ వార్తకు స్పందించి హైదరాబాదుకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ ముందుకు వచ్చింది. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి హాస్టల్ ఫీజులు, చదువుకు అవసరమైన ఇతర ఖర్చులన్నీ ఫౌండేషన్ భరిస్తుందని తెలిపారు. రూ.30 వేలు ఇప్పటికే అప్పు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలుపగా ఆ డబ్బును వారి ఖాతాకు పంపినట్లు తెలిపారు. అలాగే ఈ వార్తకు స్పందించిన మరో ఇద్దరు దాతలు రూ.3 వేలు ఆర్థిక సాయం చేసినట్లు రేష్మా తెలిపారు. తమ కుటుంబ పరిస్థితిని వెలుగులోకి తెచ్చి కుమార్తె ఇంజినీరింగ్ విద్యకు అండగా నిలిచేలా చేసిన 'ఈనాడు'కు ఆమె తల్లి కృతజ్ఞతలు తెలియజేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి సీవీఎల్ మాట్లాడుతూ... తమ సంస్థ శాఖలు తిరుపతి, మదనపల్లెలో కూడా ఉన్నాయని పేద పిల్లలకు ఉచితంగా సాయంత్రం వేళల్లో ట్యూషన్ చెబుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రెడ్డిప్రకాష్

కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి డి.రెడ్డిప్రకాష్ అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎంవీ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం తిరుపతి జిల్లా తుమ్మలగుంట హైస్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థి 1,500 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ములకలచెరువు: ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మూడే సుదర్శన్ నాయక్ ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం తిరుపతి జిల్లా, తుమ్మలకుంటలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగంలో హైజంప్‌లో ఈ విద్యార్థి 1.86 మీటర్లు, ట్రిపుల్ జంప్‌లో 12.65 సెంట్లు దూకి మొదటి స్థానంలో నిలిచాడు. త్వరలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొంటారని పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.



అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థితో పీఈటీ

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు...

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పరపల్లిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్‌లు శనివారం తెలిపారు. అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో సమీర్, శివ, అండర్ 14 వాలీబాల్ బాలుర విభాగంలో టి.వెంకటచైతన్య, ఎస్.అశ్వత్‌బాషా, అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో ఎం.రెడ్డికావ్య, సి.కృష్ణవేణి, ఎస్.ఐషా, ఎస్.షబానా, కబడీ అండర్-17 బాలుర విభాగంలో ఓబుల్‌రెడ్డి, ఎస్.నాజర్‌బాషా, అండర్-17 ఖోఖో బాలుర విభాగంలో బాలాజీ, ఎస్.నాజర్‌బాషా, అండర్-14 ఖోఖో బాలుర విభాగంలో కె.మనోహర్ ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన వారిని హెచ్.ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా హ్యాండ్‌బాల్ జిల్లా జట్లు...

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికల అండర్-17 హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక శనివారం బీటీ కళాశాల మైదానంలో ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఇందులో బాలికల విభాగంలో గ్రీష్మ, ప్రణతి, హర్షిత, లక్ష్మీ, సుప్రియ, భావన, పర్హానా, రెడ్డి, దివ్య, తన్మయ, రాణి, హేమశ్రీ, సమీరా, మహేశ్వరి, ఇందు, హేమనందిని, భావన, స్టాండ్‌బైలుగా మంజుల, పద్మజ, నిత్య, సౌమ్య, దీప్తి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో నవీన్‌కుమార్, తంగరాజు, యోగేశ్వర్, షారుక్‌ఖాన్, రంజిత్, త్రివిక్రమ్, తేజసాయిరెడ్డి, సమీర్, అనీష్ అంద్రస్, జీవన్‌కుమార్, పార్థివ్ సాయి, రాకేష్, జ్యోతిప్రకాష్, రెడ్డి ప్రసాద్, జితేంద్ర, కుషి, స్టాండ్‌బైలుగా సుబ్రహ్మణ్యం, గౌతమ్, మున్నాఖాన్, ఆలీఉల్లాఖాన్‌లను ఎంపిక చేశారు. ఎంపికయిన క్రీడాకారులు త్వరలో రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తెలిపారు. ఈ ఎంపికలో ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శి నాగరాజు, క్రీడాభారతి అధ్యక్ష కార్యదర్శులు దిలీప్‌కుమార్, నరేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, భద్రయ్య, అజీమ్, శివ, పార్థసారథి, కిరణ్, రెడ్డిప్రసాద్, క్రిస్టి, రియాజ్ పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామోపాధ్యాయులు

డిక్లరేషన్‌లో సంతకం చేశాకే జగన్ తిరుమల వెళ్లాలి

ములకలచెరువు, న్యూస్‌టుడే: తిరుమల కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైకాపాకు పుట్టగతులుండవని తెదేపా నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు ఆరోపించారు. శనివారం తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెదేపా నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వెళ్లాలంటే కచ్చితంగా డిక్లరేషన్‌లో సంతకం చేయాల్సిందేనని లేకుంటే భక్తుల మనోభావాలను దెబ్బతీసినట్లేనని, అవమానించినట్లేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తులో వైకాపా నాయకుల అయిదేళ్ల పాపాలు పండటం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డప్పరెడ్డి, నాయకులు సోముశేఖర్, రామచంద్ర, పురుషోత్తం, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగేంద్రనాయుడు, నారాయణ, మల్లికార్జున పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తెదేపా నాయకులు

ఎన్‌హెచ్‌ఏఐపై సర్వీసు రోడ్డుకు వినతి

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పట్టణం ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు, అజంతా మిట్ట నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డు వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని తెదేపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి శనివారం ఎన్‌హెచ్ డీఈ నాగరాజను కోరారు. తెదేపా నాయకులు డీఈతో కలిసి ఎల్‌బీఎస్ రోడ్డులో జరుగుతున్న వంతెన పనులను పరిశీలించారు. నాయకులు డీఈతో మాట్లాడుతూ సర్వీస్ రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్నందున వంతెన పనులు పూర్తయిన తరువాత పాదచారులు నడవాలన్నా, వాహనాలు వెళ్లాలన్నా కష్టంగా ఉంటుందని వివరించారు. వంతెన పనులకు తొలుత పట్టణంలో 90 అడుగుల స్థలం తీసుకోవాలని ప్రతిపాదించారని తరువాత ప్రజల అభీష్టం మేరకు దాన్ని 70 అడుగులకు తగ్గించారని తెలిపారు. వెడల్పు తగ్గించినందున రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను తక్కువగా తొలగించి పరిహారం కూడా చెల్లించామని తెలిపారు. పంచాయతీ కార్యాలయం, అజంతా మిట్ట వద్ద అయినా వాహనాలు 'యు' టర్న్ తీసుకునేందుకు అనుకూలంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వీసు రోడ్డులో మళ్లీ మార్పు చేసేందుకు ఎన్‌హెచ్ ఈఈతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఈ హామీ ఇచ్చారు.



ఎన్‌హెచ్‌ఏఐ డీఈ నాగరాజతో మాట్లాడుతున్న తెదేపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ రద్దుకు డిమాండు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మదనపల్లె వైద్య కళాశాలను నిర్వహించాలని, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య విధానాన్ని రద్దు చేయాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, కార్యదర్శి లింగమయ్య అన్నారు. శనివారం ఆరోగ్యవరం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె వైద్య కళాశాలను ప్రైవేటు పరం చేస్తామనడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం 107, 108 జీవో రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యకళాశాలను నడపలేమని ఎన్ఎంసీకి లేఖ రాయడం వైద్య విద్యను అమ్ముకున్నట్లేనని ఆరోపించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మదనపల్లెలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని లేకుండే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్ జేఏసీ నాయకులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఆర్ఎస్ఓ నాయకులు, విద్యార్థులు

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

బాలబడులకు తూనికల వితరణ



అంగన్‌వాడీ పాఠశాలకు అందించిన తూనిక యంత్రాలతో కార్యకర్తలు, యంగ్ ఇండియా ప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం: బండలంలోని బూర్లపల్లి సెక్టారు పరిధిలో శనివారం యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాలకు తూనిక యంత్రాలు అందజేశారు. యంగ్ ఇండియా సభ్యులు రాజశేఖర్ మాట్లాడుతూ 26 అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని అందించామన్నారు. రోజూ పిల్లల బరువు చూచి కావాల్సిన పోషకాహారం అందించడానికి ఉపయోగపడతాయన్నారు. సీడీపీవో భాగ్యమ్మ, సూపర్‌వైజర్ మునిరత్నమ్మ, ఎంఈవో-2 గౌస్‌పీర్, సభ్యులు భాస్కర్, అనిల్, మనోజ్, మున్నా, వెంకీ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

రామసముద్రం, న్యూస్‌టుడే: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రభుత్వ లక్ష్యమని ఈవోపీఆర్డీ సుధాకర్‌రెడ్డి అన్నారు. 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాలను శనివారం గ్రామ సర్పంచుల అధ్యక్షతన తిరిగి ప్రారంభించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి వానపాముల ఎరువును తయారు చేయాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పెద్దకురప్పల్లెలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి రెడ్డెప్పనాయుడు, నాయకులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

✤ మండలంలోని బసినికొండ గ్రామం ప్రాథమికపాఠశాల రోడ్డుపై చెత్తదిబ్బలను ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి విష్ణు పారిశుద్ధ్య కార్మికులతో దిబ్బలను ట్రాక్టర్ ద్వారా సంపదకేంద్రానికి తరలించారు.

✤ బసినికొండ పంచాయతీ సచివాలయం పరిధిలోని విద్యుత్తు స్తంభం చుట్టూ ప్రమాదకరంగా తీగమొక్కలు పెరగడంతో 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందితో తీగమొక్కలు తొలగించారు.

✤ పట్టుగూళ్ల విక్రయ కేంద్రంలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేశారు. మార్కెట్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో రైతులు, రీలర్లు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు సమాచారం ఇవ్వడంతో దీనిపై ఈ నెల 19న 'ఈనాడు'లో 'విక్రయ కేంద్రం... సౌకర్యాలు శూన్యం' కథనం ప్రచురితమైంది. మార్కెట్ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేశారు. నీటి సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు.

✤ అమ్మచెరువుమిట్ట సమీపంలో చెత్తదిబ్బలను పురపాలక సంఘం కార్మికులు శుభ్రం చేశారు. ఇక్కడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలను తీసుకొచ్చి పడేస్తున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఇక్కడి సమస్యపై ఈ నెల 19న 'మేమున్నాం...మీతోడుగా' ద్వారా 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేసి సమస్యను పరిష్కరించారు.

✤ రోడ్డుపై మురుగు ప్రవహించకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. మదనపల్లె- బెంగళూరు రోడ్డు బీసీ కాలనీలో మురుగు కాలువలు లేక రహదారిపై ప్రవహిస్తుండటంతో కాలనీవాసులు 'మేమున్నాం... మీతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో సమస్యపై కథనం ప్రచురితం కావడంతో ఈవోపీఆర్డీ శ్రీహరి, పంచాయతీ అధికారులు స్పందించారు. కాలనీలో తాత్కాలిక పనులతో కాలువ తవ్వించి రహదారిపై మురుగు ప్రవహించకుండా చర్యలు తీసుకున్నారు.

✤ వేంపల్లె పంచాయతీ బెంగళూరు రోడ్డులో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేశారు. పంచాయతీ పరిధిలోని ఈ రహదారిపై చెత్తదిబ్బలతో దుర్వాసన వస్తుండటంతో గ్రామస్థులు 'మేమున్నాం... మీతోడుగా'కు సమాచారం ఇవ్వడంతో ఈ నెల 7న 'ఈనాడులో' కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో భానుప్రసాద్ స్పందించి పంచాయతీ కార్మికులతో చెత్తదిబ్బలను ట్రాక్టర్ ద్వారా శుభ్రం చేయించి డంపింగ్ యార్డులకు తరలించారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

✤ **రామసముద్రం:** 'చెరువు కాదు రహదారి' శీర్షికన ఈనాడులో ఈ నెల 25న కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. రోడ్డుపై ఉన్న వర్షపునీటిని కాలువ ద్వారా పక్కకు మళ్లించారు. దీంతో రోడ్డుపై ఉన్న నీరంతా వెళ్లిపోయింది. వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా ప్రయాణం సజావుగా సాగేందుకు మార్గం సుగమనం అయింది.

సబ్‌రిజిస్ట్రార్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం విధుల్లో చేరారు. బి.కొత్తకోటలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన తంబళ్లపల్లెకు బదిలీపై వచ్చారు. కాగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రెడ్డి మార్చిలో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్నారు. రాంప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఉదయ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం నేడు

మదనపల్లె విద్య: మదనపల్లెలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. కంటి జబ్బులున్న వారు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కళాశాలకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆలయాల ఎదుట వైకాపా నాయకుల నిరసన

వాల్మీకిపురం: లడ్డూలో ఎలాంటి అపవిత్రం జరగలేదని, వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం వాల్మీకిపురంలోని శ్రీపట్టాభి రామస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ విషయంలో ఆనాటి వైకాపా ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీద లేని నిందలు మోపుతూ అసత్య కథనాలను ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సద్బుద్ధి ప్రసాదించాలని వాల్మీకిపురం శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశామని పేర్కొన్నారు.

మదనపల్లె పట్టణం : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో వైఫల్యాలను పక్కదారి పట్టించడానికి తిరుమలను వేదికగా వాడుకుంటున్నారని వైకాపా నియోజకవర్గ బాధ్యుడు నిస్సార్ అహ్మద్ ఆరోపించారు. వంద రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పురపాలక ఛైర్‌పర్సన్ మనూజ, కౌన్సిలర్లు సుగుణ, శివయ్య, రఘునాథరెడ్డి, శారదరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైకాపా శ్రేణులు

డిగ్రీ కళాశాల కథ కంచికేనా!

కాగితాలకే పరిమితమైన నిర్మాణం
ఎన్డీయే సర్కారుపైనే విద్యార్థుల ఆశలు



బి.కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల



డిగ్రీ కళాశాల కోసం కేటాయించిన బి.కొత్తకోట బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల భవనం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల కథ కంచికి చేరింది. విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఏడేళ్ల క్రితం మంజూరు చేసిన కళాశాల అనేక అవరోధాలతో ఇప్పటికీ ప్రారంభించలేకపోయారు. ఇప్పటి వరకు కాగితాల వరకే పరిమితమైన ప్రభుత్వ కళాశాల తెదేపా కూటమి ప్రభుత్వ హయాంలోనైనా మొదలవుతుందనే ఆశాభావం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో వెనుకబడ్డ ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇప్పటి వరకు ఎక్కడా లేదు. మదనపల్లె, తిరుపతి ప్రాంతాలకు ఉన్నత చదువుల కోసం విద్యార్థులు వెళ్లాలి.. లేదంటే స్థానికంగా ఉన్న ప్రైవేటు కళాశాలల్లో చదువుకోవాలి. ఇంటర్మీడియట్ తర్వాత తాము ఎంపిక చేసుకున్న వృత్తి నైపుణ్యాన్ని పెంచే కోర్సులను పూర్తి చేయడానికి విద్యార్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

చంద్రబాబు హామీతోనే మంజూరు

కురబలకోట మండలం అంగళ్లులో నవంబరు 5, 2014న సీఎం హోదాలో చంద్రబాబు గ్రామసభను నిర్వహించినప్పుడు బి.కొత్తకోటకు డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని స్థానికులు కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి డిగ్రీ కళాశాల మంజూరుపై హామీ ఇచ్చారు. అనంతరం ఉన్నత విద్యశాఖ సర్వేను నిర్వహించి కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి సీఎంకు నివేదించింది. సుదీర్ఘ కసరత్తు తర్వాత మార్చి 21, 2017న డిగ్రీ కళాశాలను ప్రారంభించడానికి అప్పటి ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులను జారీ చేశారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న వృత్తి విద్యాకోర్సుల భవనాన్ని కళాశాల కోసం తాత్కాలికంగా అప్పగించారు. ఆ మరుసటి విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రెగ్యులర్ అధ్యాపకులను నియమించకపోవడంతో పాటు తాత్కాలిక భవనాలను కేటాయించడంతో విద్యార్థులు కళాశాలలో చేరేందుకు వెనుకంజ వేశారు. కొత్తగా ఏర్పాటైన కళాశాలలో చేరితే తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని అనుమానించారు. దీంతో కళాశాల ఏర్పాటు ప్రక్రియ వెనుకబడిపోయింది.

వృత్తి విద్యాకోర్సులు ప్రారంభించాలని...

వైకాపా ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత డిగ్రీ కళాశాల ఏర్పాటు విషయాన్ని పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. డిగ్రీ సాధారణ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ముందుకు రావడం లేదన్న విషయాన్ని గుర్తించిన స్థానికులు ప్రత్యామ్నాయంగా వృత్తి విద్యాకోర్సులను ప్రవేశపెట్టాలని అభ్యర్థనలు పంపారు. డిగ్రీ కళాశాలకు బదులుగా ఐటీఐ లేదా పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయాలని సూచనలు అందాయి. వృత్తి విద్యా కోర్సులు చదువుకున్న యువతీ, యువకులకు పొరుగున ఉన్న బెంగళూరులో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పుడు మార్కెట్‌లో డిమాండు ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇప్పించడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయని స్థానికులు అంచనా వేశారు. మరోవైపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలను నిర్మించడానికి పట్టణ శివార్లలోని శంకరాపురం వద్ద మూడెకరాల భూమిని శంకరయ్య ట్రస్టు విరాళంగా కొన్నేళ్ల క్రితమే ఇచ్చింది. దీని పక్కనే ప్రభుత్వ భూమి కూడా అందుబాటులో ఉండటంతో వినియోగించుకోవడానికి అవకాశం ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో డిగ్రీ కళాశాలను లేదా వృత్తి విద్యాకోర్సుల శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు. ఈ నెల 26న బి.కొత్తకోటకు వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెదేపా నేత జయచంద్రారెడ్డిలను ఇదే విషయంపై 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా.. దీనిపై అధ్యయనం చేయించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తిరుమల పవిత్రతను కాపాడడమే జనసేన లక్ష్యం



మాట్లాడుతున్న జనసేన బాధ్యుడు సాయినాథ్, నాయకులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రతను కాపాడడమే జనసేన లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సాయినాథ్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా శనివారం ములకలచెరువు సమీపంలోని కనుగొండరాయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో అత్యంత భక్తిగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని అవహేళన చేసే విధంగా కల్తీ చేసి హిందు ధర్మానికి మచ్చ తీసుకు వచ్చారన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా తిరుమల లడ్డూ కల్తీ చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికి దక్కిందన్నారు. తిరుమల లడ్డూలో కూడా కల్తీ రాజకీయాలకు పాల్పడడం నీలిమాలిన రాజకీయమని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సురేంద్ర (షోరూం), సుదర్శన్, ప్రసాద్, శంకర, పవన్‌రెడ్డి, సుబ్బు, నవీన్, అరుణ్, భూపతి, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు సమీకృత దాణా పంపిణీ

కలికిరి, న్యూస్‌టుడే : కలికిరి మండలంలో రైతు సేవా కేంద్రాల ద్వారా సుమారు 25 టన్నుల సమీకృత దాణా పంపిణీ చేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటమునినాయుడు తెలిపారు. శనివారం కలికిరి మండలం మర్రికుంటపల్లెలో సర్పంచి రెడ్డిరామ్ ఆధ్వర్యంలో రాయితీపై రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటమునినాయుడు మాట్లాడుతూ... ప్రస్తుతం మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటంతో తీవ్ర పశుగ్రాస కొరత ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వం పాడి పశువుల ఆహార కొరతను అధిగమించడానికి పశుసంవర్ధకశాఖ ద్వారా ఈ సమీకృత దాణా పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. పశువైద్యాధికారి డాక్టర్ గిరినాథ్‌రెడ్డి, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

రేబిస్ అంతం... మన పంతం

కుక్కకాటుకు మందు తప్పనిసరిగా వాడాలని లేని పక్షంలో ఇబ్బంది తప్పదని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పశువైద్యశాలల్లో అవగాహన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పిచ్చికుక్క వల్ల ఇబ్బంది కలగకూడదనే ఆలోచనతో ప్రజలను చైతన్యవంతుల్ని చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పిచ్చికుక్క కరిస్తే, వెంటనే సబ్బునీటితో ఎక్కువ సేపు గాయాన్ని కడగాలని, అలాగే 3, 7, 14, 28వ రోజుల్లో టీకాలు వేయించుకోవాలని లేని పక్షంలో ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు. ఏటా పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని చెప్పారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



అంగళ్లులో మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, పక్కన వైద్యురాలు సౌజన్య, సిబ్బంది, పాడి రైతులు



ములకలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తలపులలో ఆరోగ్య సిబ్బందితో విద్యార్థుల ప్రదర్శన

ఇళ్లు... గడువులోగా పూర్తయితేనే బిల్లు



బి.కొత్తకోటలో ప్రసంగిస్తున్న మదనపల్లె గృహ నిర్మాణశాఖ ఈఈ వెంకటదాస్



మదనపల్లెలో మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మీ, పక్కన హౌసింగ్ అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులు, కూటమి నాయకులు కోరారు. శనివారం 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి కరపత్రాలను ప్రదర్శించారు. లేఅవుట్లలో పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, అవసరమైతే ఆర్థిక సాయానికి ప్రతిపాదన చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, గృహ నిర్మాణశాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



పీలేరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్ఈ దామోదర్‌రెడ్డి

రాయితీపై ఉలవల పంపిణీ

బి.కొత్తకోట: తెదేపా కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని బి.కొత్తకోట మండల తెదేపా అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి పిలుపునిచ్చారు. బీరంగిలో శనివారం రైతులకు ఉలవ విత్తనాలను వ్యవసాయశాఖ పంపిణీ చేసింది. కార్యక్రమంలో పాల్గొన్న నారాయణస్వామిరెడ్డి మాట్లాడుతూ... తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు ఆనంద్, గోపి, శ్రీరాములు, జయరాంరెడ్డి, సుబ్బయ్య, సూరి, నారాయణప్ప, కృష్ణమూర్తిలు ఇందులో పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్లు నరికేందుకు యత్నం

ములకలచెరువు, న్యూస్‌టుడే : శ్రీగంధం చెట్లు నరికేందుకు దుండగులు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ములకలచెరువు మండలం, గాలేటివారిపల్లికి చెందిన కృష్ణప్పకు గ్రామం పక్కనే పొలం ఉంది. తన కుమారుడి సమాధి చుట్టూ శ్రీగంధం చెట్లు నాటారు. చెట్లు పెద్దవి కావడంతో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నరికేందుకు ప్రయత్నించారు. దీంతో కృష్ణప్ప విషయాన్ని గమనించి తన మనవడితో కలిసి ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నరికేందుకు ప్రయత్నించిన చెట్లను పోలీసులు పరిశీలించారు.

సర్వసభ్య సమావేశం మమ

- అజెండాపై చర్చకు ముందే ముగింపు
- మాట్లాడుతుండగా వెళ్లిపోయిన ఛైర్‌పర్సన్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : అజెండాలోని అంశాలపై చర్చ జరుగకుండానే కౌన్సిలర్ సాధారణ సర్వసభ్య సమావేశం ముగించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం కౌన్సిలర్లు అజెండాలోని అంశాలపై ఏకగ్రీవ ఆమోదం తెలిపి సమావేశం నుంచి వెళ్లిపోయారు. 20వ వార్డు కౌన్సిలర్ తులసి సమస్యలపై ప్రస్తావిస్తుండగానే ఛైర్‌పర్సన్ మనూజ కుర్చీలో నుంచి దిగి వెళ్లిపోయారు. కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగిన తీరుపై కౌన్సిలర్లు నాగార్జునబాబు (గాంధీ), కరీముల్లా, తులసి తీవ్ర అభ్యంతరం తెలిపారు. సంఖ్యాబలం ఉందన్న ఏకైక కారణంతో సమావేశాన్ని నిర్వహించకుండా, ప్రజల సమస్యలపై చర్చించకుండా వెళ్లిపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ● పురపాలక కౌన్సిల్ సమావేశంలో శనివారం ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు విజయవాడ వరదల్లో మరణించిన వారి ఆత్మశాంతి కోసం రెండు నిముషాలు మౌనం పాటించారు. 27వ వార్డు కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ వరద బాధితులకు మదనపల్లె ప్రజలు అండగా నిలబడ్డారని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముందుండి నగదు, నిత్యావసర సరకులు సేకరించి స్వయంగా విజయవాడకు వెళ్లి బాధితులకు అందజేశారన్నారు. 6వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు లేచి అజెండాలోని అంశాలన్నింటికీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నామని ప్రకటించారు. 20వ వార్డు కౌన్సిలర్ తులసి లేచి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా పర్యటించి బాధితులకు అండగా నిలబడటం అభినందనీయమన్నారు. ఇంతలో ఛైర్‌పర్సన్ గంటకొట్టి సమావేశం ముగిసిందని ప్రకటించి కుర్చీలో నుంచి లేచి వెళ్లిపోయారు. ఛైర్‌పర్సన్ తీరుపై ముగ్గురు కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. 32వ వార్డు కౌన్సిలర్ నాగార్జునబాబు (గాంధీ) మాట్లాడుతూ సంఖ్యాబలం ఉందన్న కారణంగా సమావేశం నిర్వహించకుండా ఏకగ్రీవ ఆమోదం తెలిపి వెళ్లిపోవడం సరికాదన్నారు. పట్టణంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కనీసం వీటిపై కౌన్సిలర్లు చర్చించడానికి అవకాశం కల్పించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమావేశంలో కమిషనర్ ప్రమీల, మేనేజరు మనోహర్, డీఈఈ వేణుగోపాల్, శ్రావణి, ఏఈఈ స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.



తెదేపా కౌన్సిలర్ తులసి మాట్లాడుతుండగా కుర్చీలో నుంచి లేచి వెళ్లిపోతున్న ఛైర్‌పర్సన్ మనూజ

విప్లవ వీరుడికి జోహార్లు... కవి చక్రవర్తికి నివాళులు

విప్లవవీరుడు భగత్‌సింగ్, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువల జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం 14 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్‌సింగ్ పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువ అని ప్రధానోపాధ్యాయుడు రెడ్డి మోహన్ తెలిపారు. పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లి పంచాయతీ ఎల్లంవారిపల్లె పాఠశాలలో తెలుగు పండితుడు, అష్టావధాని లోకా జగన్నాథశాస్త్రి మాట్లాడుతూ... మధుర భావాల కవికోకిల జాషువా అని సమాజంలోని అసమానతలను తన కవనఖడ్గంతో చీల్చి చెండాడిన నవయుగ కవి చక్రవర్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు



పెద్దమండ్యం మండలం ఎల్లంవారిపల్లె పాఠశాలలో విద్యార్థుల కోలాటం

సర్వీసు రోడ్లు విస్తరించండి

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు పట్టణంలో జరుగుతున్న రైల్వే వంతెన నిర్మాణంలో రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా సర్వీసు రోడ్లు వెడల్పు పెంచాలని వ్యాపారులు, ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎస్వీ మహల్ నుంచి పంచాయతీ మిట్ట వరకు వంతెన పోనూ ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ 10 అడుగులు వెడల్పు లేకుండా పోయిందని వ్యాపారులు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఇదే సమస్యను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు శనివారం పీలేరుకు వచ్చారు. సర్వీసు రోడ్ల వెంబడి లారీలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు అధికారులకు చెప్పారు. ఆటోలు మినహా ఏ ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని వ్యాపారులు, ప్రజలు అధికారులకు వివరించారు. ఇదే ప్రాంతంలో ఆసుపత్రులు, కళాశాలలు కేంద్రీకృతమై ఉండడంతో అంబులెన్సులు, పాఠశాల బస్సులు వెళ్లే అవకాశం లేకుండా పోతుందని, తమ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందని, వెడల్పు పెంచాలని వారు వివరించారు. ప్రజల విన్నపాలను అధికారుల దృష్టికి తీసుకెళతాయని డీఈ చెప్పారు.



రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పుర కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

రాజంపేట, న్యూస్‌టుడే: పురపాలక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పురపాలక కమిషనర్ నాగేశ్వరరావుకి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ విన్నవించారు. ఈ సందర్భంగా శనివారం పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. సమస్యల సాధనకు న్యాయపోటీలో నిర్వహించే కార్యక్రమానికి వెళుతున్నామని పుర కార్మికులు ఆయన దృష్టికి తెచ్చారు. పురకార్మిక సంఘనాయకులు రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, సురేష్ పాల్గొన్నారు.

అక్టోబర్ 2న భారీ ర్యాలీ


కరపత్రాలు విడుదల చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు కాకర్ల రాముడు డిమాండు చేశారు. ఈ మేరకు అక్టోబర్ 2న రాజంపేట పట్టణంలోని ర.భ.శాఖ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నామన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను వీహెచ్‌పీ నాయకులు శనివారం విడుదల చేశారు. ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ నాయకులు పోకల ప్రభాకర్, శ్రీనివాసులనాయుడు, రెడ్డయ్యరాజు, సుధాకర్‌బాబు, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట: 9441872651
రాయచోటి: 9703622242
రైల్వేకోడూరు: 7981695235

స్పందనకు వందనం

వీరబల్లి: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని హరితహారంలోని చెత్తను గత వారం శుభ్రం చేశారు. 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 'చెత్త నిల్వలు తొలగించండి' అనే శీర్షికతో చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు.

గాలివీడు: నూలివీడు పంచాయతీ అవులరెడ్డిగారిపల్లెలోని ఓ వీధిలో పైపులైన్ పగిలి తాగునీటి సమస్య తలెత్తుతున్నది. ఈ సమస్యపై ఈ నెల 14న 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షికన నీటి సమస్య తీర్చాలని 'తాగునీటి సమస్య తీర్చండి' అనే శీర్షికతో చిత్ర వార్త ప్రచురితం కాగా పంచాయతీ సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైంది.

మంత్రి చొరవతో సీసీ రహదారులకు మార్గం సుగమం

రూ.10 కోట్ల ఉపాధిహామీ పథకం నిధులు మంజూరు

న్యూస్‌టుడే, చిన్నమండెం


నిధులు మంజూరైన దేవగుడిపల్లెలో గుట్టలమైన కాలనీ

రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని పలు గ్రామాల్లోని మట్టి రోడ్లు సీసీ రహదారులుగా మారనున్నాయి. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఉపాధి హామీ పథకం నిధులతో జరిగే ఈ పనులు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో త్వరలో చేపట్టనున్నారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వంలో ఉపాధి పథకం కింద గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. చివర్లో ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించడంతో అక్కడక్కడ సీసీ రోడ్లు నిర్మించారు. అదే కూటమి ప్రభుత్వంలో ఒకేసారి రూ.10కోట్లతో రోడ్లు వేస్తుండడం విశేషం. ఇప్పటికే సంబేపల్లె మండలంలో రూ.కోటితో రోడ్డు పనులను, రామాపురం మండలంలో ఒక రోడ్డు పనులు ప్రారంభించారు. మిగతా పనులు త్వరలోనే మొదలవుతాయని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

● రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలంలో రూ.2.85కోట్లతో 36 రోడ్ల పనులు, సంబేపల్లె మండలంలో రూ.కోటితో ఒక రోడ్డు, గాలివీడులో రూ.2.15 కోట్లతో 23 పనులు, రాయచోటి గ్రామీణలో రూ.1.49 కోట్లతో 19 పనులు, లక్కిరెడ్డిపల్లెలో రూ.1.40కోట్లతో 40 పనులు, రామాపురంలో రూ.1.20కోట్లతో 26 పనులు చేయనున్నారు.

విద్యుత్తు స్తంభాల మరమ్మతులకు శ్రీకారం


ఉస్మాన్‌నగర్‌లో నూతన స్తంభానికి కనెక్షను ఇచ్చారిలా...

రాజంపేట, న్యూస్‌టుడే: పట్టణంలో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకుస్తుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ సమస్యపై ఈ నెల 25న 'విద్యుత్తు స్తంభాలు... మృత్యు పాశాలు!' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి ఉస్మాన్‌నగర్‌లో పాత విద్యుత్తు స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభానికి శనివారం కనెక్షన్ ఇచ్చారు.

'విద్యావ్యవస్థ నిర్వీర్యం'

రాజంపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థల ఆవరణలో శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండో మహాసభ నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులు, కార్మికులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యంరాజు, నరసింహులు, మహేష్, మాధవ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్మికుల ర్యాలీ

త్వరలోనే భవన నిర్మాణాలకు నిధులు


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలను డీఈవో ప్రకాష్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. వసతులు, విద్యాబోధన వంటి అంశాలపై విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాల తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.. పూర్తి స్థాయిలో నిర్మాణాలకు నిధులు త్వరలోనే మంజూరవుతాయని ఆయన చెప్పారు. ఆయన వెంట హెచ్ఎం రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

సుండుపల్లి, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు అనర్థదాయకమని ఎంఈవో రవీంద్రనాయక్ పేర్కొన్నారు. రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో సుండుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ యుక్త వయస్సు రానిదే వివాహం చేస్తే చేసుకున్న వారి ఎదుగుదల, మానసిక పరిపక్వత లోపిస్తాయన్నారు. హెచ్ఎం జయన్న, సంస్థ ప్రతినిధి రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలి

పెనగలూరు, లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన నివాసాల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వరప్రసాద్ సూచించారు. పెనగలూరులో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని వారు పరిశీలించారు. డిసెంబర్ 31వ తేదీలోపు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, పతకమూరి బాబు నాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నాగినేని రాంప్రసాద్ నాయుడు పాల్గొన్నారు. లక్కిరెడ్డిపల్లెలో హౌసింగ్ ఏఈ జనార్ధన్, ఈవోపీఆర్డీ పట్నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్ మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నేడు

రాయచోటి: ఉపాధ్యాయులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడల పోటీలు నిర్వహించనున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, ఎస్.జాబీర్‌లు పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాల ఆవరణలో శనివారం వారు మాట్లాడారు. యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా క్రీడల పోటీలు నిర్వహించనున్నామన్నారు. జిల్లా స్థాయి పోటీలను రాయచోటిలో ఆదివారం నిర్వహిస్తామన్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవాలి


మాట్లాడుతున్న పసుపులేటి శంకర్

రాయచోటి, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలకు అనుగుణంగానే దేవాదాయ అధికారులు పని చేయాలని ఒంటిమిట్ట పోతల సాహిత్య పీఠం అధ్యక్షుడు, రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డాక్టరు పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో శనివారం ఆయన మాట్లాడారు. దేవాలయాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో దూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఈవో వెంకటరమణారెడ్డి చెప్పారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, శ్రీనివాసులు, మునిరాజ, భారత పురావస్తు శాఖ అధికారి రామాంజనేయులు, విశ్రాంత తహసీల్దారు జయన్న పాల్గొన్నారు.

మునగాకు వినియోగంపై అవగాహన


ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

సుండుపల్లి, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలకు ఆకుకూరల వినియోగంపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి పేర్కొన్నారు. సుండుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. వారంలో నాలుగు రోజులు ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు వనజమ్మ, వెంకటలక్షుమమ్మ, సుశీలమ్మ, విజయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకాలతోనే రేబిస్ నియంత్రణ

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పెంపుడు జంతువులతో రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని... ముందస్తు టీకాలతో రేబీస్‌ను అరికట్టవచ్చని పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై అన్నారు. ప్రపంచ రేబిస్ నివారణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పశు వైద్యాధికారులు మాలకొండయ్య, రియాజ్, శివారెడ్డి, లోకేశ్ పాల్గొన్నారు.

శ్మశానాన్ని ఆక్రమించారని ఫిర్యాదు

గాలివీడు, న్యూస్‌టుడే: గ్రామ దేవత ఆలయ ఆవరణంతో పాటు శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించారని నాయునివారిపల్లె గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఉప తహసీల్దారు టి.వీ తిమ్మారెడ్డికి వినతి పత్రం అందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

చక్రంపేట(పెనగలూరు),న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి క్రీడలకు చక్రంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లేబాక గోపాలకృష్ణ తెలిపారు. కడప స్పోర్ట్స్ పాఠశాలలో శనివారం జరిగిన క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. డిస్క్‌త్రోలో జూనియర్స్ విభాగంలో సర్వజ్ఞ, సీనియర్స్ విభాగంలో సానియాలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

స్వచ్ఛభారత్ వైపు అడుగులు


విద్యార్థులు వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులు

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మనం, మన నివాసాలు స్వచ్ఛభారత్ వైపు అడుగులు వేయాలని పురపాలక సచివాలయ శానిటేషన్ అధికారి హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. స్థానిక ఇన్‌ఫంట్ జీసెస్ పాఠశాలలో స్వచ్ఛ భారత్-స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

రాజంపేట గ్రామీణ: చెయ్యేరు నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు మన్నూరు సీఐ రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

చరవాణి దుకాణంలో చోరీ

రాయచోటి, న్యూస్‌టుడే: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఓ చరవాణి దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు దుకాణం తాళాలు తొలగించి ప్రవేశించి రూ.20 వేలు నగదు, చరవాణిల విడి భాగాలను దోచుకెళ్లారని యజమాని అబూబకర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాత్రి గస్తీని పటిష్టం చేసి చోరీలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో వైకాపా నేతల పూజలు


నాగిరెడ్డిపల్లెలోని మారమ్మ ఆలయంలో ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు

రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారంటూ అధికార పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని పలువురు వైకాపా నేతలు దుయ్యబట్టారు. అటువంటి నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ శనివారం పలువురు వైకాపా నేతలు ఆయా ప్రాంతాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. వైకాపా పాలనలోనే ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయింపు జరిగిందన్నారు. రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నందలూరు మండలం నాగిరెడ్డిపల్లిలోని మారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోనంపేట వైద్యాధికారి సిద్ధయ్య సూచించారు. జాండ్రపల్లె ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో రవీంద్ర, పర్యవేక్షకురాలు సరస్వతి, హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకే ప్రాధాన్యం

పుల్లంపేట, న్యూస్‌టుడే: వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా విద్యార్థులకు మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

రాయచోటి, న్యూస్‌టుడే: మాసాపేటలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం కొట్టే పవన్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సామూహిక సాయి సత్య వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

'తిరుమల ప్రతిష్టను దిగజార్చిన వైకాపా'

రాయచోటి : తిరుమల ప్రతిష్ఠను వైకాపా పాలనలో దిగజార్చారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా ధ్వజమెత్తారు. తెదేపా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగినట్లు ల్యాబ్ టెస్టింగ్‌లో తేలినా వైకాపా నేతలు సీఎం చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారన్నారు. సాంబశివారెడ్డి, ఆంజనేయరెడ్డి, కొండ నాగరాజా తదితరులున్నారు.

భగత్‌సింగ్, గుర్రం జాషువా స్ఫూర్తి ప్రదాతలు



రైల్వేకోడూరు శ్రీషిరిడీ సాయి కళాశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


నందలూరులో జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు తెదేపా నాయకుల నివాళి

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్, నవయుగ మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలను రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు విద్యాలయాలు, కార్యాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఒకరు తెల్లదొరల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మహావీరుడైతే మరొకరు తన రచనలతో మూఢ నమ్మకాలను పారద్రోలి దళితులలో చైతన్యం తీసుకొచ్చిన మహాకవిగా పేరొందారని కొనియాడారు. వారు చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. అనంతరం ఇరువురి చిత్రపటాలను పూలమాలలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకుని దేశం పట్ల భక్తిభావంతో మెలగాలని సూచించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



రాజంపేట రీజెన్సీ నలందా కళాశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, ప్రిన్సిపల్ తదితరులు


రాజంపేటలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న తెలుగుభాషా సంరక్షణ సమితి నాయకులు



రాయచోటిలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు